


# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

GST No.37ACDFM5465G1Z1

RNI-APTEL/2012/46499

No: KNL/3`78(D)/2026`2028


**సమస్యలను సామరస్యంగా పరిష్కరించాలి**




Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ | సంపుటి -14 | సంచిక - 203 | పేజీలు - 08 | వెల - 05/- | సోమవారం 20-07-2026


# ఢిల్లీలో అఖిలపక్ష భేటీలో రగడ..
## విపక్షాల వాకౌట్



- టీఎంసీ రెబల్ ఎంపీలను ఆహ్వానించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన విపక్షాలు
- నిరసనగా సమావేశం నుంచి కొద్దిసేపు వాకౌట్ చేసిన విపక్ష నేతలు
- రెబల్ ఎంపీలకు ఇంకా స్పీకర్ ఆమోదం లేదని విపక్షాల వాదన
- గుర్తింపు కోరిన పార్టీలను పిలిచామని స్పష్టం చేసిన కేంద్ర ప్రభుత్వం

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు కొన్ని గంటల ముందు కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో గందరగోళం చెలరేగింది. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) రెబల్ ఎంపీలకు ఆహ్వానం పలకడాన్ని నిరసిస్తూ విపక్ష పార్టీల నేతలు సమావేశం నుంచి వాకౌట్ చేశారు. అయితే, ఇది కేవలం సాంకేతిక నిరసన మాత్రమేనని తెలిపి, కొద్ది నిమిషాలకే తిరిగి సమావేశంలో పాల్గొన్నారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాల అజెండాను చర్చించేందుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశం మొదలైన వెంటనే కాంగ్రెస్, టీఎంసీ, సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే, ఆప్, శివసేన (యూబీటీ) సహా పలు విపక్ష పార్టీల నేతలు నిరసనగా బయటకు వెళ్లిపోయారు. టీఎంసీ నుంచి తిరుగుబాటు చేసిన సుమారు 20 మంది ఎంపీలు నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ)లో చేరారు. అయితే, ఈ విలీనానికి లోక్‌సభ స్పీకర్ నుంచి అధికారికంగా ఎలాంటి ఆమోదం లభించలేదని, పార్లమెంట్ రికార్డుల్లో

మిగతా 2లో

### జమ్మూ కశ్మీర్‌లో జల ప్రళయం..
## 12 మంది మృతి

12 మంది ప్రాణాలు కోల్పోయిన వైనం



- జమ్మూ కశ్మీర్‌లో భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు, విరిగిపడిన కొండచరియలు
- పూంచ్, రాజౌరీ జిల్లాల్లో తీవ్ర ఆస్తి నష్టం
- నిరసన రద్దు చేసుకుని సహాయక

2లో

## గాంధీభవన్‌కు రావొద్దు..
# నేతలకు సీఎం కఠిన ఆదేశాలు!

ఆగస్టు 3 వరకు క్షేత్రస్థాయిలోనే ఉండాలని నేతలకు సూచన



- ఎస్ఐఆర్‌పై రేవంత్ కఠిన ఆదేశాలు
- గాంధీభవన్‌కు రావొద్దన్న సీఎం
- నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరిక
- ఉత్తమ 100 బీఎల్‌ఏలకు రాహుల్‌తో కలిపిస్తామని హామీ

ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారి పార్టీ నాయకత్వాన్ని అప్రమత్తం చేశారు. ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. ఓటర్ల హక్కులకు భంగం కలగకుండా ప్రతి నాయకుడు క్షేత్రస్థాయిలో ఉండి ప్రక్రియను పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎస్ఐఆర్‌పై నేడు నిర్వహించిన వర్చువల్ సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ఎస్ఐఆర్ సమన్వయకర్తలు పాల్గొన్నారు. ఎస్ఐఆర్ బాధ్యతలు అప్పగించిన మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ ఇన్‌ఛార్జిలంతా తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పనిచేయాలని సీఎం ఆదేశించారు. జిల్లాల వారీగా మంత్రులు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని,

మిగతాది 2లో

## ఓడలరేవు బీచ్‌లో విషాదం:
# సముద్రంలో మునిగి ముగ్గురు యువకుల మృతి



- కోనసీమ ఓడలరేవు బీచ్‌లో తీవ్ర విషాదం
- సముద్ర స్నానానికి దిగి ముగ్గురు యువకులు గల్లంతు
- తొలుత ఇద్దరి మృతదేహాలు లభ్యం
- ఆ తర్వాత మరో యువకుడి మృతదేహం లభ్యం
- సెలవులకు ఊరికొచ్చి ప్రాణాలు కోల్పోయిన యువత

కోనసీమ జిల్లాలో ఆదివారం సాయంత్రం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. అల్లవరం మండలం ఓడలరేవు సముద్ర తీరంలో సరదాగా గడిపేందుకు వెళ్లిన

2

### చారిత్రక పర్యటనకు రాష్ట్రపతి.. తొలిసారిగా మాల్డోవా,
# నార్త్ మాసిడోనియాకు!

తొలిసారిగా మాల్డోవా, నార్త్ మెసిడోనియాకు వెళ్లనున్న భారత రాష్ట్రపతి

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మూడు దేశాల పర్యటనకు శ్రీకారం
- మూడు దశాబ్దాల తర్వాత రొమేనియాలో ముర్ము పర్యటన
- వాణిజ్యం, పెట్టుబడులే ప్రధాన అజెండాగా ఈ చారిత్రక యాత్ర



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వారం రోజుల విదేశీ పర్యటనకు ఆదివారం బయల్దేరారు. తూర్పు ఐరోపాలోని మాల్డోవా, నార్త్ మాసిడోనియా, రొమేనియా దేశాల్లో ఆమె పర్యటించనున్నారు. భారత రాష్ట్రపతి మాల్డోవా, నార్త్ మాసిడోనియాలకు వెళ్లడం ఇదే తొలిసారి కావడం ఈ పర్యటనకు చారిత్రక ప్రాధాన్యాన్ని ఇచ్చింది. అలాగే, మూడు దశాబ్దాల తర్వాత భారత రాష్ట్రపతి రొమేనియాలో పర్యటించనున్నారు. జులై 19 నుంచి 25 వరకు సాగే ఈ పర్యటనలో భాగంగా మూడు దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవడంపై దృష్టి సారిస్తారు. వాణిజ్యం, పెట్టుబడులు, టెక్నాలజీ, వ్యవసాయం, విద్య, వైద్య ఆరోగ్య రంగాల్లో సహకారాన్ని పెంచుకోవడమే లక్ష్యంగా చర్చలు జరుపుతారు. పర్యటన తొలి అంకంలో మాల్డోవా అధ్యక్షురాలు మైయా సాండు ఆహ్వానం మేరకు ఆ దేశంలో

మిగతాది 2లో

## 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల విజేతలకు సీఎం అభినందనలు

- నిన్న జాతీయ సినీ అవార్డులు ప్రకటించిన కేంద్రం
- విజేతలపై అభినందనల వర్షం
- తెలుగు చిత్ర పరిశ్రమ సాధించిన విజయాలు గర్వకారణమన్న ముఖ్యమంత్రి
- కళ, సంస్కృతి, సినిమా మన అస్తిత్వానికి మూలస్తంభాలని వ్యాఖ్య
- తెలుగు సినిమా మరిన్ని ఉన్నత శిఖరాలను అందుకోవాలని ఆకాంక్ష




72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల విజేతలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. విజేతలందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ, తెలుగు

మిగతాది 2లో

## రామాయపట్నం పోర్టుపై
# జగన్ ట్వీట్...

భారీ నష్టానికి పోర్టును ప్రైవేటుకు కట్టబెట్టే కుట్ర జరుగుతోందని ఆరోపణ

- రామాయపట్నం పోర్టుపై టీడీపీ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకున్న జగన్
- రూ.4929 కోట్ల ప్రాజెక్టును రూ.1500 కోట్లకే అమ్ముతున్నారని విమర్శ
- టీడీపీ పెద్దల జేబులు నింపడానికే ఈ స్కామ్ అంటూ ఘాటు వ్యాఖ్యలు
- ఇదేం అర్థశాస్త్రం అంటూ చంద్రబాబును సూటిగా ప్రశ్నించిన జగన్



రామాయపట్నం పోర్టు విషయంలో ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్ర భవిష్యత్తుకు అత్యంత కీలకమైన రామాయపట్నం పోర్టును టీడీపీ పెద్దల జేబులు నింపేందుకు ఓ భారీ స్కామ్‌గా మార్చారని, రాష్ట్ర ఖజానాకు వేల కోట్ల రూపాయల నష్టం కలిగించేందుకు సిద్ధమయ్యారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక పోస్ట్ చేస్తూ ప్రభుత్వంపై ఘాటు విమర్శలు గుప్పించారు.

**మా హయాంలో పురోగతి... ఇప్పుడు ప్రైవేటుపరం**

నవ్యాంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధికి పోర్టులే కీలకమని భావించిన తమ ప్రభుత్వం, రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట పోర్టుల నిర్మాణంలో గణనీయమైన పురోగతి సాధించిందని జగన్ గుర్తుచేశారు. ఈ మూడు పోర్టులకు సంబంధించి భూసేకరణ, అన్ని రకాల చట్టబద్ధమైన అనుమతులు, ఆర్థిక వనరుల సమీకరణ వంటి అత్యంత క్లిష్టమైన పనులన్నీ తమ హయాంలోనే పూర్తయ్యాయని ఆయన వివరించారు.

మిగతాది 2లో

## ఏపీలో మళ్లీ కరోనా
# కలకలం..

- క్యాన్సర్ చికిత్స పొందుతున్న బాలుడికి, డయాలసిస్ చేయించుకుంటున్న బాలికకు పాజిటివ్
- వారి కుటుంబ సభ్యులకు నిర్వహించిన పరీక్షల్లో నెగటివ్
- ఆందోళన వద్దని చెబుతున్న ఆరోగ్య శాఖ అధికారులు

2



ఆంధ్రప్రదేశ్‌లో కరోనా వైరస్ కేసులు మళ్లీ స్వల్పంగా పెరుగుతున్నాయి. తాజాగా నెల్లూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో రెండు కొత్త కేసులు వెలుగులోకి రావడం కొంత ఆందోళన కలిగిస్తోంది.



2

## న్యూయార్క్‌లో అడుగుపెడితే
# నెతన్యాహు అరెస్ట్?..

- ఐరాస సదస్సు కోసం న్యూయార్క్ రానున్న ఇజ్రాయెల్ ప్రధాని
- నెతన్యాహును అరెస్ట్ చేసే విషయమై న్యాయ నిపుణులతో చర్చిస్తున్నామన్న న్యూయార్క్ మేయర్
- మేయర్ జోహ్రాన్ మామ్దానీ వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించిన ఇజ్రాయెల్ శ్రేణులు
- మేయర్ వ్యాఖ్యలు కేవలం పబ్లిసిటీ స్టంట్ మాత్రమేనని కొట్టిపారేసిన ఐరాస ఇజ్రాయెల్ రాయబారి

ఐక్యరాజ్యసమితి సదస్సు కోసం న్యూయార్క్ రానున్న ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహును అరెస్ట్ చేసే

# రామాయపట్నం పోర్టుపై జగన్ ట్వీట్...

నవ్యాంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధికి పోర్టులే కీలకమని భావించిన తమ ప్రభుత్వం, రామాయపట్నం,



మచిలీపట్నం, మూలపేట పోర్టుల నిర్మాణంలో గణనీయమైన పురోగతి సాధించిందని జగన్ గుర్తుచేశారు. ఈ మూడు పోర్టులకు సంబంధించి భూసేకరణ, అన్ని రకాల చట్టబద్ధమైన అనుమతులు, ఆర్థిక వనరుల సమీకరణ వంటి అత్యంత క్లిష్టమైన పనులన్నీ తమ హయాంలోనే పూర్తయ్యాయని ఆయన వివరించారు. ప్రాజెక్టుల పూర్తి కోసం ఈపీసీ కాంట్రాక్టులను కూడా ఖరారు చేసి, 2024 జూన్ నాటికి నిర్మాణ పనుల్లో చెప్పుకోదగ్గ పురోగతిని సాధించామని తెలిపారు. ఇంత కష్టపడి ఒక రూపు తీసుకొచ్చిన పోర్టును ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం అప్పనంగా ప్రైవేటుపరం చేసేందుకు కుట్ర పన్నుతోందని ఆయన ఆరోపించారు.

**పోర్టుతో ముడిపడిన భారీ ప్రాజెక్టులు**

రామాయపట్నం పోర్టు వల్ల రాష్ట్రానికి అపారమైన ఆర్థిక ప్రయోజనాలు చేకూరనున్నాయని జగన్ తన పోస్టులో ప్రస్తావించారు. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) సుమారు రూ.1 లక్ష కోట్లకు పైగా పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ, పెట్రోకెమికల్ కాంప్లెక్స్ పూర్తిగా రామాయపట్నం పోర్టుపైనే ఆధారపడి ఉందని తెలిపారు. ముడి చమురు దిగుమతికి ఈ పోర్టు కీలకం కానుందన్నారు. అలాగే, ఇండోసోల్ సోలార్ సంస్థ ఏర్పాటు చేయనున్న గిగా స్కేల్ తయారీ ప్లాంటుకు కూడా ఈ పోర్టే ఆధారం అని తెలిపారు. ముడిసరుకుల దిగుమతికి, తయారైన సోలార్ మాడ్యూళ్ల ఎగుమతికి ఈ డీప్ వాటర్ పోర్టు అత్యంత అవసరమని పేర్కొన్నారు. వీటితో పాటు, వైఎస్సార్ కడప జిల్లాలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ నిర్మిస్తున్న ఉక్కు కర్మాగారానికి అవసరమైన ముడి ఇనుము, కోకింగ్ కోల్ వంటివి దిగుమతి చేసుకోవడానికి రామాయపట్నం పోర్టులో ఆ సంస్థ రెండు బెర్తులను అభివృద్ధి చేస్తోందని గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టులన్నీ వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించడమే కాకుండా, రాష్ట్రానికి పన్నుల రూపంలో భారీ ఆదాయాన్ని సమకూరుస్తాయని జగన్ వివరించారు.

**రూ.3,500 కోట్ల నష్టానికి అమ్మకం**

ఇన్ని ఆర్థిక ప్రయోజనాలున్న రామాయపట్నం పోర్టును టీడీపీ ప్రభుత్వం ఓ భారీ స్కామ్‌గా మార్చేందుకు ప్రయత్నిస్తోందని జగన్ తీవ్రంగా ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.4,929 కోట్లు ఖర్చు చేసి నిర్మిస్తున్న ఈ పోర్టును, కేవలం రూ.1,500 కోట్ల ముందస్తు చెల్లింపులకే ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తోందని ఆయన విమర్శించారు. దీనివల్ల రాష్ట్ర ఖజానాకు తీరని నష్టం వాటిల్లుతుందని, మిగిలిన రూ.3,500 కోట్లకు పైగా అప్పుల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే మోయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ పెద్దలకు నగదు ప్రవాహాలు సృష్టించడమే ఈ కుట్ర వెనుక ఉన్న అసలు లక్ష్యమని ఆయన ధ్వజమెత్తారు.

# గాంధీభవన్‌కు రావొద్దు.. నేతలకు సీఎం కఠిన ఆదేశాలు!

పార్టీ ఇన్‌ఛార్జిలంతా తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పనిచేయాలని సీఎం ఆదేశించారు. జిల్లాల వారీగా మంత్రులు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని, చివరి బాధ్యత వారిపైనే ఉంటుందని స్పష్టం చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమన్వయ బాధ్యతలను మరింత సమర్థంగా నిర్వహించాలని సూచించారు. ఎస్ఐఆర్ గడువును ఆగస్టు 3 వరకు పొడిగించడాన్ని అవకాశంగా మలుచుకోవాలని రేవంత్‌రెడ్డి అన్నారు. సోమవారం నుంచి 10 మంది ఇన్‌ఛార్జి మంత్రులు జిల్లాల వారీగా సమీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొంటూనే ఎంపీలు తమకు కేటాయించిన ప్రాంతాల్లో సమీక్షలు కొనసాగించాలని ఆదేశించారు. బాధ్యతలు నిర్వర్తించని ఎంపీలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటివరకు రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 489 ఎస్ఐఆర్ సమావేశాలు నిర్వహించినట్లు సీఎం తెలిపారు. వెనుకబడిన నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కొంతమంది నాయకులు హైదరాబాద్‌కే పరిమితమై పని చేయడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఆగస్టు 3 వరకు గాంధీభవన్‌కు ఎవరూ రావొద్దని సీఎం స్పష్టం చేశారు. ఛైర్మన్ పదవులు, పార్టీ పోస్టుల కోసం గాంధీభవన్ చుట్టూ తిరిగేవారికి నియామకాలు ఉండవని తేల్చిచెప్పారు.

జులై 30న మరోసారి సమగ్ర సమీక్ష నిర్వహించి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నివేదికలు పరిశీలిస్తామని వెల్లడించారు. బూత్ లెవల్ అధికారుల (బీఎల్ఓ) నివేదికలపై మాత్రమే ఆధారపడొద్దని సీఎం సూచించారు. పార్టీ తరపున పనిచేస్తున్న బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏ) నివేదికలను కూడా తప్పనిసరిగా పరిశీలించాలని ఆదేశించారు. పార్టీ బీఎల్ఏలతో నిరంతర సమన్వయం కొనసాగించాలని, క్షేత్రస్థాయిలో వారి సేవలను

సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. రానున్న పది రోజులు నాయకులంతా నియోజకవర్గాల్లోనే పర్యటించాలని రేవంత్‌రెడ్డి చెప్పారు. గాంధీభవన్ బృందం బీఎల్ఏ, బీఎల్ఓ నివేదికలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అత్యుత్తమంగా పనిచేసిన 100 మంది బీఎల్ఏలకు రాహుల్ గాంధీని కలిసే అవకాశం కల్పించడంతో పాటు ఆయనతో ఫొటో దిగే అవకాశం కూడా ఇస్తామని ప్రకటించారు.

# న్యూయార్క్‌లో అడుగుపెడితే నెతన్యాహు అరెస్ట్?..

ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహును అరెస్ట్ చేసే అంశంపై న్యూయార్క్ నగర మేయర్ జోహ్రాన్



మామ్దానీ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా తీవ్ర దుమారం రేపుతున్నాయి. శనివారం 'ది న్యూయార్క్ టైమ్స్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మేయర్ మాట్లాడుతూ.. నెతన్యాహును ఒక యుద్ధ నేరస్థుడిగా అభివర్ణించారు. అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసీసీ) ఆయనపై మోపిన ఆరోపణల నేపథ్యంలో, ఆయన ది హేగ్‌లోని జైలుకు వెళ్లాల్సిన వ్యక్తి అని స్పష్టం చేశారు. తన ఎన్నికల ప్రచారంలోనే నెతన్యాహును అరెస్ట్ చేస్తానని మామ్దానీ హామీ ఇచ్చారు. అయితే, ఒక విదేశీ దేశాధినేతను అరెస్ట్ చేసే అధికారం నగర మేయర్‌కు ఉందా లేదా అనే అంశంపై తాము ప్రస్తుతం నగర న్యాయ సలహాదారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు ఆయన వెల్లడించారు. "న్యూయార్క్ నగర చట్టాలు నాకు ఏ మేరకు అనుమతి ఇస్తే.. ఆ మేరకు చర్యలు తీసుకోవడానికి నేను వెనుకాడను" అని మామ్దానీ తేల్చి చెప్పారు. గత కొన్నేళ్లుగా నెతన్యాహు తీసుకున్న నిర్ణయాల వల్లే ప్రపంచవ్యాప్తంగా చాలా మంది ఇదే అభిప్రాయంతో ఉన్నారని ఆయన పేర్కొన్నారు. మేయర్ మామ్దానీ వ్యాఖ్యలపై ఇజ్రాయెల్ శ్రేణులు తీవ్రంగా స్పందించాయి. ఐరాసలో ఇజ్రాయెల్ రాయబారి డానీ డానన్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా కౌంటర్ ఇస్తూ.. "న్యూయార్క్ నగరంలో పెరుగుతున్న యూదు వ్యతిరేకతను (యాంటీ సెమిటిజం) అరికట్టడం చేతకాని మేయర్, కేవలం హెడ్‌లైన్స్‌లో నిలవడం కోసమే ఇజ్రాయెల్‌పై దాడి చేస్తున్నారు. మీ బెదిరింపుల వల్ల ఏమీ మారదు. ప్రధాని నెతన్యాహు సగర్వంగా న్యూయార్క్ వస్తారు, ఐరాసలో ఇజ్రాయెల్ తరపున గళం విప్పుతారు. ఈ కేసులో ఎవరినైనా అరెస్ట్ చేయాల్సి వస్తే, అది మొదట మేయర్ జోహ్రాన్ మామ్దానీనే" అని మండిపడ్డారు. కాగా, ఒక రేడియో షోలో నెతన్యాహు మాట్లాడుతూ.. మేయర్ మామ్దానీ హమాస్ ఉగ్రవాదులకు మద్దతు ఇస్తున్నారని, ఆయన మనసులో అమెరికాపై తీవ్ర ద్వేషం దాగి ఉందని ఆరోపించారు.

# జమ్మూ కశ్మీర్‌లో జల ప్రళయం.. 12 మంది మృతి

జమ్మూ కశ్మీర్‌లోని సరిహద్దు జిల్లాలు పూంచ్,



రాజౌరీలలో ఆదివారం కురిసిన కుండపోత వర్షాలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటంతో మొత్తం 12 మంది మరణించారు. ఇంకా పలువురి ఆచూకీ తెలియరాలేదు. ఈ ప్రకృతి విపత్తు కారణంగా వందలాది ఇళ్లు, పాఠశాలలు ధ్వంసమవగా, భారీగా ఆస్తి నష్టం సంభవించింది.

అధికారుల వివరాల ప్రకారం, పూంచ్ జిల్లాలో 9 మంది మృతి చెందగా, మరో ముగ్గురు గాయపడ్డారు. రాజౌరీ జిల్లాలో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, ఇద్దరు గల్లంతయ్యారు, ఒకరు గాయపడ్డారు. గల్లంతైన వారి కోసం ఆర్మీ, పోలీసులు, స్థానిక బృందాలు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టాయి. ముఖ్యంగా పూంచ్ జిల్లాలోని సురన్‌కోట్ తహసీల్‌లో నష్టం తీవ్రంగా ఉంది. ఈ రెండు జిల్లాల్లో కలిపి 130కి పైగా ఇళ్లు, 18 పాఠశాలలు, అనేక వాహనాలు దెబ్బతిన్నాయి. కొన్ని ప్రాంతాల్లో మొబైల్ కనెక్టివిటీ పూర్తిగా స్తంభించిపోయింది. వందలాది ఇళ్లకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. సుమారు 127 కనాల్స్ విస్తీర్ణంలో పంట నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా. విషయం తెలియగానే ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఢిల్లీలో తలపెట్టిన తన నిరసన కార్యక్రమాన్ని రద్దు చేసుకుని హుటాహుటిన జమ్మూకు చేరుకున్నారు. ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి సహాయక చర్యలను సమీక్షించారు. బాధితుల ప్రాణాలను కాపాడటమే తమ ప్రథమ ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ఇతర రాజకీయ నేతలు ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, బాధితులను ఆదుకోవడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు.

## వాంగ్‌చుక్ ఆరోగ్యంపై ఇంకా పర్యవేక్షణ.. ఆసుపత్రి బులెటిన్‌లో కీలక వివరాలు

21 రోజుల నిరాహార దీక్ష తర్వాత ఆసుపత్రిలో చేరిన సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. అయితే పర్యవేక్షణ మాత్రం కొనసాగుతోందని వెల్లడించారు. బయటకు ఆయన సాధారణంగానే కనిపిస్తున్నా.. దీర్ఘకాలం ఆహారం తీసుకోకపోవడం వల్ల శరీరంలో దుష్పరిణామాలు ఇంకా పూర్తిగా సద్దుమణగలేదని వైద్యులు చెబుతున్నారు. అందుకే ఆయన్ను నిపుణుల బృందం నిరంతరం గమనిస్తోందన్నారు. ఎలాంటి ఇబ్బంది తలెత్తినా వెంటనే చికిత్స అందించేలా ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. ఢిల్లీలోని వీఎంఎంసీ–సఫ్దర్‌జంగ్ ఆసుపత్రి ఆదివారం విడుదల చేసిన ఆరోగ్య బులెటిన్‌లో ఈ విషయాలు వెల్లడించింది. ప్రస్తుతం ప్రాణాధార సూచీలు స్థిరంగానే ఉన్నాయని తెలిపింది. అయితే రక్త పరీక్షల్లో కొన్ని విలువలు ఇంకా సాధారణ స్థాయికి చేరలేదని వివరించింది. దీర్ఘకాల నిరాహార దీక్ష శరీరంలోని పలు వ్యవస్థలపై ప్రభావం చూపుతుందని, అందుకే నిరంతర వైద్య పర్యవేక్షణ తప్పనిసరి అని పేర్కొంది. సఫ్దర్‌జంగ్ వైద్యులతో పాటు ఎయిమ్స్ నిపుణులు కూడా వాంగ్‌చుక్ ఆరోగ్యాన్ని పరిశీలిస్తున్నారు. ఆయన పరిస్థితిని గంట గంటకూ అంచనా వేస్తూ చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఎలాంటి ప్రమాద సూచనలు కనిపించకపోయినా, దీక్ష ప్రభావం ఒక్కసారిగా బయటపడే అవకాశం ఉండటంతో వైద్య బృందం అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. అవసరమైన పరీక్షలు ఎప్పటికప్పుడు నిర్వహిస్తూ ఆరోగ్య పరిస్థితిని అంచనా వేస్తోంది. ఇదిలా ఉండగా చికిత్సపై పారదర్శకత లేదంటూ వాంగ్‌చుక్ భార్య గీతాంజలి జె. ఆంగ్మో ఆసుపత్రి యాజమాన్యానికి లేఖ రాశారు. తమ కుటుంబం ఎంపిక చేసిన వైద్య కేంద్రానికి తరలించేందుకు వీలుగా వీలైనంత త్వరగా డిశ్చార్జి ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. ఈ అభ్యర్థనపై ఆసుపత్రి నుంచి ఇంకా అధికారిక స్పందన రాలేదు. జంతర్‌మంతర్‌లో కొనసాగుతున్న ఆందోళనలో భాగంగా వాంగ్‌చుక్ జూన్ 28న నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించారు. 21 రోజుల పాటు ఆహారం తీసుకోకపోవడంతో ఆరోగ్యం క్షీణించింది. ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు, వైద్యుల సూచనల మేరకు శనివారం తెల్లవారుజామున పోలీసులు ఆయనను సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించారు. ఆ సమయంలో అక్కడున్న ఆందోళనకారులు నిరసన వ్యక్తం చేశారు. జూన్ 6 నుంచి కొనసాగుతున్న ఈ నిరసనలో నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సీజేపీ డిమాండ్ చేస్తోంది.

-------------------------

# ఓడలరేవు బీచ్‌లో విషాదం:

## సముద్రంలో మునిగి ముగ్గురు యువకుల మృతి

కోనసీమ జిల్లాలో ఆదివారం సాయంత్రం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. అల్లవరం మండలం ఓడలరేవు సముద్ర తీరంలో సరదాగా గడిపేందుకు వెళ్లిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు యువకులు అలల ఉద్ధృతికి గల్లంతై ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో ఆ కుటుంబంలో తీరని శోకం మిగిలింది. వివరాల్లోకి వెళితే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మాచవరం గ్రామానికి చెందిన తొమ్మిది మంది కుటుంబ సభ్యులు ఆదివారం పిక్నిక్ కోసం ఓడలరేవు బీచ్‌కు వెళ్లారు. వీరిలో అరవింద్ (23), శ్రీరామ్ (17), మంచిల సాయి సముద్రంలో స్నానానికి దిగారు. అయితే, అలల తాకిడికి వారు అదుపుతప్పి సముద్రంలో కొట్టుకుపోయారు. దీంతో అప్రమత్తమైన కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే గాలింపు చర్యలు చేపట్టారు. మత్స్యకారుల సహాయంతో గాలించగా, అరవింద్, శ్రీరామ్ మృతదేహాలు లభ్యమయ్యాయి. గల్లంతైన మరో యువకుడు సాయి మృతదేహాన్ని కూడా వెలికితీశారు. హైదరాబాద్, ఇతర ప్రాంతాల్లో చదువు, ఉద్యోగాల నిమిత్తం ఉంటూ ఇటీవలే సెలవులపై సొంత గ్రామానికి వచ్చిన యువకులు ఇలా ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఒకేసారి ముగ్గురు యువకులు మృతి చెందడంతో మాచవరం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సముద్ర తీరంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఏపీలో మళ్లీ కరోనా కలకలం..

ఇప్పటికే ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఇద్దరు చిన్నారులకు కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. వివరాల్లోకి వెళ్తే, నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం నిడిగుంటపాలెంకు చెందిన మూడేళ్ల బాలుడు క్యాన్సర్ చికిత్స నిమిత్తం పుదుచ్చేరిలో ఉండగా, అతనికి కరోనా సోకినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాగా, బాలుడి కుటుంబ సభ్యులకు, సమీప బంధువులకు నిర్వహించిన పరీక్షల్లో నెగటివ్ అని తేలింది. మరోవైపు, ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం రోలపాడుకు చెందిన 13 ఏళ్ల బాలిక కిడ్నీ సంబంధిత సమస్యలతో విజయవాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో డయాలసిస్ చేయించుకుంటోంది. జ్వరం, ఇతర లక్షణాలు కనిపించడంతో వైద్యులు పరీక్షలు నిర్వహించగా, ఆమెకు కోవిడ్ పాజిటివ్‌గా తేలింది. దీంతో బాలికను వెంటనే ఐసోలేషన్ వార్డుకు తరలించారు. ఆమె కుటుంబ సభ్యులకు నిర్వహించిన పరీక్షల్లో కూడా నెగటివ్ అని నిర్ధారణ అయ్యింది. రాష్ట్రవ్యాప్తంగా జూన్ 26 నుంచి జులై 16 మధ్య కాలంలో మొత్తం 12 కోవిడ్ కేసులు, నాలుగు మరణాలు నమోదయ్యాయి. కడప జిల్లాలో అత్యధికంగా 8 కేసులు నమోదు కాగా, గుంటూరులో రెండు, విశాఖపట్నం, కాకినాడ జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున కేసులు వెలుగు చూశాయి. మరణించిన వారంతా రక్తపోటు, మధుమేహం, కిడ్నీ వ్యాధుల వంటి ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నవారేనని అధికారులు వెల్లడించారు. ప్రస్తుతానికి కేసుల వ్యాప్తి తీవ్రంగా లేనందున ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అయితే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య శాఖ సూచించింది.

## చారిత్రక పర్యటనకు రాష్ట్రపతి..

## తొలిసారిగా మాల్డోవా, నార్త్ మాసిడోనియాకు!

ఆ దేశంలో పర్యటిస్తారు. అనంతరం నార్త్ మాసిడోనియాకు వెళతారు. ఈ రెండు దేశాల్లోని అధ్యక్షులు, పార్లమెంట్ స్పీకర్లతో రాష్ట్రపతి ముర్ము సమావేశమవుతారు. అక్కడి వ్యాపార ఫోరమ్‌లలో ప్రసంగించడంతో పాటు ప్రవాస భారతీయులతోనూ భేటీ అవుతారు. పర్యటన చివరి అంకంలో భాగంగా జులై 23 నుంచి 25 వరకు రొమేనియాలో పర్యటిస్తారు. ఈ పర్యటనతో ఆయా దేశాలతో భారత సంబంధాలకు కొత్త ఊపు వస్తుందని విదేశాంగ శాఖ ఆశాభావం వ్యక్తం చేసింది. పెట్టుబడి అవకాశాలను పరిశీలించేందుకు రాష్ట్రపతి వెంట ఉన్నతస్థాయి వ్యాపార ప్రతినిధి బృందం కూడా ఈ పర్యటనలో పాల్గొంటోంది.

## ఢిల్లీలో అఖిలపక్ష భేటీలో రగడ.. విపక్షాల వాకౌట్



ఈ విలీనానికి లోక్‌సభ స్పీకర్ నుంచి అధికారికంగా ఎలాంటి ఆమోదం లభించలేదని, పార్లమెంట్ రికార్డుల్లో వారు ఇంకా టీఎంసీ ఎంపీలుగానే ఉన్నారని విపక్షాలు వాదించాయి. పార్లమెంట్ వెబ్‌సైట్‌లో ఎన్‌సీపీఐ అనే పార్టీయే లేనప్పుడు వారిని ఎలా ఆహ్వానిస్తారని టీఎంసీ ఎంపీ సౌగతా రాయ్ ప్రశ్నించారు. ఇది నిబంధనలను ఉల్లంఘించడమేనని విపక్షాలు ఆరోపించాయి. ఈ పరిణామంపై కేంద్రమంత్రి కిరణ్ రిజిజు స్పందిస్తూ.. స్పీకర్ వద్ద గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకున్న పార్టీలను ఆహ్వానించడం తమ బాధ్యత అని తెలిపారు. మరోవైపు, తమకు ఆహ్వానం అందడాన్ని ఎన్‌సీపీఐ నేత కకోలి ఘోష్ దస్తిదార్ స్వాగతించారు. ఈ ఘటనతో వర్షాకాల సమావేశాలు వాడివేడిగా సాగే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ సమావేశాల్లో నీట్ పరీక్షల లీకేజీలు, వ్యవసాయ సమస్యలు, రామాలయ విరాళాల అంశాలను లేవనెత్తాలని విపక్షాలు సిద్ధమవుతున్నాయి.

## 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల విజేతలకు సీఎం అభినందనలు



ఈ మేరకు ఆయన ఆదివారం సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. విజేతలందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ, తెలుగు చిత్ర పరిశ్రమ సాధించిన విజయాలపై ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించారు. తెలుగు సినీ పరిశ్రమకు చెందిన నటీనటులు, దర్శకులు, నిర్మాతలు, సాంకేతిక నిపుణుల అసాధారణ ప్రతిభ మన సినిమాకు గొప్ప గర్వకారణంగా నిలిచిందని చంద్రబాబు కొనియాడారు. "కళ, సంస్కృతి, సినిమా మన అస్తిత్వానికి, వారసత్వానికి బలమైన మూలస్తంభాలు. తెలుగు సినిమా భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, తరతరాలకు స్ఫూర్తినివ్వాలి" అని ఆయన తన పోస్టులో ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అవార్డులు గెలుచుకున్న వారందరూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. తన పోస్ట్‌లో ప్రముఖ నటులు మమ్ముట్టి, యామీ గౌతమ్, కార్తీక్ ఆర్యన్, నిహారిక కొణిదెల, దర్శకుడు సుకుమార్‌లను ట్యాగ్ చేయడం విశేషం. దీంతో పాటు 'పుష్ప 2', 'కల్కి 2898 ఏడీ', 'లక్కీ భాస్కర్' వంటి ప్రతిష్ఠాత్మక చిత్రాల హ్యాష్‌ట్యాగ్‌లను కూడా జతచేశారు.

# రాయలసీమకు మరింత సేవ చేసే అదృష్టం, శక్తి ఇవ్వాలని ఆ దేవుళ్లను ప్రార్థిస్తున్నా.

## మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి.





కర్నూలు ప్రతినిధి. జూలై 19 . (పల్లె వెలుగు ):నా రాయలసీమకు మరింత సేవ చేసే అదృష్టం, ఎక్కువ శక్తి ఇవ్వాలని ఆ దేవుళ్లను ప్రార్థిస్తున్నానని రాయలసీమ ఉద్యమనేత, టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి అన్నారు. ఆదివారం కర్నూలు టి.జి.వి. కళాక్షేత్రంలో రచయిత పత్తి ఓబులయ్య రచించిన "సీమ రైతు కన్నీటి వేత" పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో రాయలసీమ ఉద్యమనేత, టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ శాసనసభ్యులు బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బైరెడ్డి రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ రచయిత పత్తి. ఓబులయ్య రచించిన సీమ రైతు కన్నీటి వేత పుస్తకం ఆవిష్కరణ చేయడం, అది నాపేరుకు అంకితం చేయడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని, రాయలసీమకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. రైతుల కష్టాలు, సీమ ప్రాంత ప్రజల సమస్యలు సమాజానికి తెలియజేసే ఇటువంటి రచనలు మరింత అవగాహన కల్పిస్తాయని పేర్కొన్నారు. రైతు సంక్షేమం, సీమ అభివృద్ధి పట్ల తమ కట్టుబాటు ఎల్లప్పుడూ కొనసాగుతుందన్నారు. పత్తి. ఓబుళపతి రచయితగా, కవిగా, పౌరాణిక కళాకారుడుగా, సాహిత్యంలో ఎంతో అనుభవం ఉందని, రాబోవు రాయలసీమ తరానికి, యువతకు మేలు చేసేవి, చైతన్య కలిగించే మరిన్ని పుస్తకాలు, పాటలు అవసరం అని బైరెడ్డి అన్నారు. కర్నూలు టి. జి. వి కళాక్షేత్రం ద్వారా భవిష్యత్ కళాకారులు తయారు కావాలని, ఇప్పటికే ఎన్నో అవార్డులు వచ్చాయని, మరిన్ని రావాలని బైరెడ్డి రాజశేఖరరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. మాజీ ఎంపీ, రాయలసీమ ఉద్యమ నాయకులు టి. జి. వెంకటేష్ సమక్షంలో రచయిత పత్తి. ఓబుళపతి రచించిన సీమ రైతు కన్నీటి వేత పుస్తకం తనకు అంకితం ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. రాయలసీమ యువత కోసం తాను కొత్త ప్రాజెక్టు నెలకొల్పి అన్ని రంగాల్లో రాయలసీమ ఉద్యమం బలోపేతం చేసి రాయలసీమకు నీళ్లు, నిధులు, నియమకాలు, సమాన వాటా సాధించేలా మా కొత్త ప్రాజెక్టు లక్ష్యంమని బైరెడ్డి రాజశేఖరరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులు, రచయితలు, కవులను, రాయలసీమ ఉద్యమకారులను బైరెడ్డి రాజశేఖరరెడ్డి అభినందించారు.

### క్షతగాత్రులకు కొండంత అండ:

# మానవత్వం చాటిన కాటసాని రామభూపాల్ రెడ్డి

- శబరిమల భక్తుల కారు బోల్తా.. స్వయంగా సహాయక చర్యలు చేపట్టిన మాజీ ఎమ్మెల్యే
- వైద్యులతో మాట్లాడి తక్షణ చికిత్సకు ఏర్పాట్లు.. సర్వత్రా అభినందనల జల్లు





పల్లె వెలుగు కర్నూలు బ్యూరో ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలోనే అసలైన మానవత్వం ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి మరోసారి నిరూపించారు. రహదారి ప్రమాదానికి గురై రక్తపు మడుగులో విలవిల్లాడుతున్న శబరిమల భక్తులను చూసి చలించిపోయిన ఆయన, తక్షణమే స్పందించి బాధితులకు కొండంత అండగా నిలిచారు.

నియంత్రణ కోల్పోయి బోల్తా పడిన కారు

హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్‌సిటీకి చెందిన కొందరు భక్తులు శబరిమల అయ్యప్ప స్వామి దర్శనం కోసం కారులో బయలుదేరారు. ఈ క్రమంలో కర్నూలు జిల్లా కల్లూరు మండలం చిన్నటేకూరు సమీప జాతీయ రహదారిపైకి రాగానే, కారు అకస్మాత్తుగా అదుపుతప్పి రోడ్డుపైనే అనేక పల్టీలు కొడుతూ బోల్తా పడింది. ఈ ఘోర ప్రమాదంలో కారులోని భక్తులందరికీ తీవ్ర గాయాలయ్యాయి. వాహనం పూర్తిగా దెబ్బతిన్నప్పటికీ, అదృష్టవశాత్తు ప్రాణాపాయం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

సమయస్ఫూర్తితో స్పందన..

అదే సమయంలో అనంతపురం నుంచి కర్నూలు వైపు వస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి చిన్నటేకూరు వద్ద జరిగిన ఈ ప్రమాదాన్ని గమనించారు. క్షణం కూడా ఆలస్యం చేయకుండా తన వాహనాల శ్రేణిని ఆపి, ఘటనా స్థలానికి పరుగులు తీశారు. రంగంలోకి దిగి.. దగ్గరుండి వైద్యశాలకు తరలింపు ప్రమాద స్థలంలో రక్తగాయాలతో రోదిస్తున్న భక్తులను చూసి కాటసాని స్వయంగా వారిని ఓదార్చి ధైర్యం చెప్పారు. వెంటనే స్థానిక అధికారులను అప్రమత్తం చేసి, అత్యవసరంగా రోగవాహక బండిని (అంబులెన్స్‌ను) రప్పించారు. క్షతగాత్రులను సురక్షితంగా వాహనంలోకి ఎక్కించి, కర్నూలులోని ప్రముఖ వైద్యశాల 'శ్రీ చక్ర'కు తరలించేలా చర్యలు తీసుకున్నారు.

వైద్యులతో అత్యవసర సమన్వయం

కేవలం వైద్యశాలకు పంపించడంతోనే తన బాధ్యత ముగిసిందని అనుకోకుండా, కాటసాని రామభూపాల్ రెడ్డి శ్రీ చక్ర వైద్యశాల వైద్యులతో దూరవాణి (ఫోన్) ద్వారా తక్షణమే మాట్లాడారు. క్షతగాత్రులు అక్కడికి చేరుకునేలోపే అత్యవసర వైద్య బృందాన్ని సిద్ధం చేయించారు. బాధితులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, మెరుగైన ఉచిత చికిత్స అందేలా అన్ని ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు.

ప్రమాద సమయంలో రాజకీయ నాయకుడిలా కాకుండా, ఓ కుటుంబ సభ్యుడిలా వచ్చి ప్రాణాలు కాపాడిన కాటసాని రామభూపాల్ రెడ్డి సమయస్ఫూర్తిని, ఆయనలోని సేవా గుణాన్ని బాధితులతో పాటు స్థానిక ప్రజలు, ప్రయాణికులు వేనోళ్ల కొనియాడుతున్నారు.

# విజయవంతంగా ముగిసిన రాష్ట్రస్థాయి సీనియర్ చెస్ ఛాంపియన్ షిప్ పోటీలు.

జాతీయ సాయి పోటీలకు ఎంపికైన మహేంద్ర తేజ(గుంటూరు), స్వర్ణ నిహాల్(తిరుపతి), ఆదిత్య(ఎన్టీఆర్ జిల్లా), దుర్వేశ్(గుంటూరు).
బహుమతి ప్రధానం చేసిన ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ వైస్ చైర్మన్ డాక్టర్ జి. రవి కృష్ణ.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ఆంధ్రప్రదేశ్ నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు,





ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ వైస్ చైర్మన్ డాక్టర్ రవి కృష్ణ అధ్యక్షతన, జిల్లా చెస్ సంఘం కార్యదర్శి రామసుబ్బారెడ్డి నిర్వహణలో జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో రామకృష్ణ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సుబ్బయ్య, నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సందీప్, జోన్ చైర్మన్ సోమేశుల నాగరాజు అతిథులుగా పాల్గొని రాష్ట్రస్థాయి చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా చెస్ సంఘం నిర్వహణలో, నంద్యాల జిల్లా చెస్ సంఘం కార్యదర్శి రామసుబ్బారెడ్డి పర్యవేక్షణలో గత రెండు రోజులుగా నంద్యాల రామకృష్ణ పీజీ కళాశాలలో జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్ చెస్ ఛాంపియన్ షిప్ పోటీలు ఆదివారం సాయంత్రం విజయవంతంగా ముగిసాయి. ఈ సందర్భంగా విజేతలకు, వివిధ వయసు కేటగిరీలలో స్థానాలు సంపాదించిన క్రీడాకారులకు ట్రోఫీలు, పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ క్రీడలలో పాల్గొన్నప్పుడు విజయం సాధించాలనే పట్టుదలతో ఆడాలని, విజేతలుగా నిలిచిన వారు తిరిగి గెలవాలనే ఆకాంక్షతో,విజయం సాధించని వారు భవిష్యత్తులో విజయం సాధించడానికి క్రమశిక్షణతో కూడిన నిరంతర సాధన ద్వారా విజయాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా చెస్ సంఘం కార్యదర్శి రామసుబ్బారెడ్డి ,రామకృష్ణ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సుబ్బయ్య, నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సందీప్, మేడా చంద్రశేఖర్, కోశాధికారి సురేష్, జోనల్ చైర్మన్ సోమేశుల నాగరాజు, చీఫ్ ఆర్బిటర్ వెంకట కుమార్, జిల్లా సంఘం సంయుక్త కార్యదర్శి రాజా రమేష్ చక్రవర్తి, ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ కమిటీ సభ్యులు కర్నూలు జిల్లా చెస్ సంఘం కార్యదర్శి కామిశెట్టి శ్రీనివాస్,ప్రతినిధులు నాగ శ్రీనిష్, ఇమామ్, వ్యాయామ ఉపాధ్యాయులు మాలిక్ భాష, శంకర్, ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లాల నుండి వచ్చిన 224 మంది క్రీడాకారులు, కోచ్ లు, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన రాష్ట్ర జట్టు క్రీడాకారులు నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్ ఛాంపియన్ షిప్ పోటీలలో వరస స్థానాలు సాధించి విజేతలుగా నిలిచిన గుంటూరు కు చెందిన మేకల మహేంద్ర తేజ, తిరుపతికి చెందిన స్వర్ణ నిహాల్, ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఆదిత్య, గుంటూరు కు చెందిన దొండపాటి దుర్వేశ్ లు ట్రోఫీలు, నగదు బహుమతులు అందుకోవడమే కాకుండా, జాతీయ స్థాయి పోటీలలో రాష్ట్రం తరపున పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు.

# ప్రజా సమస్యలపై జీవన్ రెడ్డి దూకుడు

- రాసుఖ్ నగర్‌లో రోడ్ల సమస్యలపై స్థానికులతో సమీక్ష

నాగారం19 (పల్లె వెలుగు), న్యూస్: నాగారం డివిజన్ పరిధిలోని రాసుఖ్ నగర్ అన్నపూర్ణ





కాలనీలో నెలకొన్న రోడ్ల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ నాయకుడు కౌకుట్ల జీవన్ రెడ్డి దూకుడు ప్రదర్శిస్తున్నారు. ఆదివారం కాలనీలో పర్యటించిన ఆయన స్థానిక ప్రజలతో సమావేశమై రోడ్ల దుస్థితి, వర్షాకాలంలో ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీలో ప్రతిపాదిత 40 అడుగుల రహదారికి సంబంధించిన అంశంపై కూడా ప్రజలతో చర్చించి వారి అభిప్రాయాలు, సూచనలను స్వీకరించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, వారికి అనుకూలంగా సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో చర్చించి త్వరితగతిన చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని జీవన్ రెడ్డి హామీ ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారంలో రాజీ పడబోమని, కాలనీ అభివృద్ధి కోసం నిరంతరం ప్రజలతో కలిసి పనిచేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాగారం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు భూమయ్య యాదవ్, కాంగ్రెస్ నాయకులు శ్రీశైలం, బాల నరసింహ, కాలనీ అధ్యక్షుడు జె. దాసు, జనరల్ సెక్రటరీ వేణుగోపాల్‌తో పాటు కాలనీ వాసులు పాల్గొన్నారు.

# కెవిఆర్ హాస్పిటల్ డాక్టర్ సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం విజయవంతం..

పాణ్యం జులై 19 పల్లె వెలుగు : మండల కేంద్రంలో కెవిఆర్ ఆసుపత్రి నంద్యాల డాక్టర్ సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతమైంది.






ఆదివారం స్థానిక విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల భవనం ఆవరణలో నిర్వహించారు. అనంతరం చిన్నపిల్లల వైద్యురాలు నిత్య, న్యూరాలజిస్ట్ వైద్యుడు జయ రామకృష్ణ ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు వైద్య శిబిరం నిర్వహించారు. దాదాపు 236 మందికి సాధారణ పరీక్షలు,300 మందికి బిపి,మధుమేహ,కంటి వ్యాధి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు.ప్రతి ఒక్కరు వ్యక్తిగత శుభ్రత ,పరిసరాల పరిశుభ్రత పాటించాలని వైద్యులు తెలిపారు.కార్యక్రమంలో కేవిఆర్ హాస్పిటల్ సిబ్బంది,విశ్రాంత ఉద్యోగులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కామేశ్వరి దేవి అమ్మవారికి పుట్టింటి సారె

మహానంది, పల్లె వెలుగు మహానంది పుణ్యక్షేత్రంలో వెలిసిన శ్రీ కామేశ్వరి దేవి అమ్మవారికి పుట్టింటి సారెను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. ఆదివారం వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వాసవి క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడు సిద్దా సూర్య ప్రకాష్,



గవర్నర్స్ డిస్టిక్ ఆఫీసర్ లింగం నాగ శైలజ ఆధ్వర్యంలో ఆషాడ మాసం సందర్భంగా అమ్మవారికి పుట్టింటి సారెను తీసుకొచ్చారు. క్షేత్రానికి వచ్చిన వీరికి ఆలయ మర్యాదలతో ఏఈవో మధు, వేద పండితులు స్వాగతం పలికారు. అనంతరం వారు ఉత్సవంగా తీసుకొచ్చిన శ్రీ మహానందీశ్వర స్వామి వారికి పట్టు వస్త్రాలు, శ్రీ కామేశ్వరి అమ్మవారికి పట్టు చీరలు సమర్పించి, పసుపు కుంకుమలు అందజేశారు. వీరికి వేద పండితులు వేద ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మునగనూరు శ్రీలక్ష్మితో పాటు వందలాది మంది మహిళలు పాల్గొన్నారు.

# కొత్తూరు సుబ్బరాయుని సన్నిధిలో జడ్జి పూజలు

పాణ్యం. జూలై 19 . (పల్లె వెలుగు ):ప్రముఖ శైవ క్షేత్రం నంద్యాల జిల్లా పాణ్యం మండలం



ఎస్ కొత్తూరు గ్రామంలో వెలసి ఉన్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సన్నిధిలో గుంటూరు జిల్లా జడ్జి కొల్లపూడి కిషోర్ ఆదివారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు నారాయణస్వామి కృష్ణయ్య స్వామి సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారి కి అభిషేక అర్చనలు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆశీర్వామండపం నందు శేష వస్త్రములతో పూలమాలతో ఘనంగా జడ్జి గొల్లపూడి కిషోర్ కు ప్రసాదం అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు నాగమయ్య పురుషోత్తం రెడ్డి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహానందీశ్వరుని సేవలో

# విశ్రాంత ఐఏఎస్ అధికారి పూజలు



మహానంది, పల్లె వెలుగు  మహానంది పుణ్యక్షేత్రంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి లక్ష్మీనారాయణ పూజలు నిర్వహించారు. ఆదివారం వీరికి ఆలయ సూపర్డెంట్ అంబటి శశిధర్ రెడ్డి, వేద పండితులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి అమ్మవార్లను దర్శించుకొని అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించుకున్నారు. పూజల అనంతరం అధికారులు శేష వస్త్రంతో సత్కరించగా, వేద పండితులు వేద ఆశీర్వచనాలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఎమ్మిగనూరు మండల కురువ సంఘం అధ్యక్షుడిగా

### కే, రవికుమార్ ఎన్నిక,





ఎమ్మిగనూరు పల్లె వెలుగు జూలై 19 ఎమ్మిగనూరు మండల కురువ సంఘం అధ్యక్షుడిగా నాపై విశ్వాసం ఉంచి నన్ను ఎన్నుకున్న కురువ సంఘం రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల నాయకులకు, పెద్దలకు, యువతకు మరియు సంఘ సభ్యులందరికీ నా హృదయపూర్వక ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కురువ సంఘం అభివృద్ధి, ఐక్యత, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తాను. కురువ సమాజ హక్కుల పరిరక్షణ, యువత ప్రోత్సాహం, విద్య, ఉపాధి అవకాశాల కల్పన, సామాజిక మరియు రాజకీయ అభివృద్ధి కోసం అందరినీ కలుపుకుని ముందుకు సాగుతాను ఈ బాధ్యతను నాకు అప్పగించిన ప్రతి నాయకుడికి, సంఘ సభ్యులకు మరోసారి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, అందరి సహకారంతో ఎమ్మిగనూరు మండల కురువ సంఘాన్ని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని తెలియజేస్తున్నాను.

## మూడవ జాబితాలో త్రిబుల్ ఐటీ కి జోష్నఎంపిక




దొర్నిపాడు జులై 19 పల్లె వెలుగు న్యూస్ దొర్నిపాడు మండలంలోని అమ్మిరెడ్డి నగర్ గ్రామంలో గల కస్తూరిబబాలికల పాఠశాలలో చదువుతున్న జోస్నఅనే బాలిక ఒంగోలు త్రిబుల్ ఐటీ కి ఎంపికైనట్లు పాఠశాలఎస్ఓ జయమణితెలిపారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొదటి జాబితాలో ఒకరు మూడవ జాబితాలో ఒకరు ఇద్దరు అమ్మాయిలు త్రిబుల్ ఐటీ కి ఎంపికైనట్లు ఆమె తెలిపారు, వీరి ఎంపికకు ఉపాధ్యాయుల కృషి బాలికల పట్టుదలే కారణమన్నారు ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు అభినందనలు తెలుపుతున్న అన్నారు, ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థినులు సిబ్బంది పాల్గొన్నారు

## జోరుగా సీడుపత్తి విత్తన సాగు

దొర్నిపాడు జూలై 19 పల్లె వెలుగు న్యూస్ గత రెండు రోజులుగా కురుస్తున్న అడపదడపవర్షానికి రైతులు జోరుగ సీడుపత్తి సాగు చేస్తున్నారు, బహుళ జాతి కంపెనీలైన నూజివీడు ,మ్యాన్ శాంటో,క్రిస్టల్ ,ఇలా వివిధ రకాల సీడు పత్తిసాగును రైతులు చేస్తున్నారు, ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఒకప్పుడు దొర్నిపాడు మండలం మొదటి స్థానంలో ఉండేది, గతంలో వేల ఎకరాల్లో రైతులు సీడ్ పత్తిసాగు చేసేవారు, దీంతో సుమారు పదివేల మందివ్యవసాయ కూలీలకు పైగానేమూడు నెలలపాటు నిరంతరంగా ఉపాధి ఉండేది, అయితేగతసంవత్సరం ప్రస్తుత సంవత్సరం కంపెనీలు గింజలు ఇవ్వకపోవడంతో కేవలం వందలఎకరాలకే పత్తి సాగు పరిమితమైంది, సీడ్ పత్తి సాగులో చాలామంది రైతులు నష్టపోయారు అందుకే కంపెనీలు గింజలు ఇవ్వకపోవడం కాక నష్టపోతామనే భయంతో చాలామంది రైతులు పత్తి సాగుకు సుముఖంగా లేరు, సీటు పత్తి సాగు విపరీతంగా ఉన్నప్పుడు మండలంలో వ్యాపార వాణిజ్యాలు కలకల లాడేవిసాగు తగ్గడంతో అవి కూడా తగ్గిపోయాయని చెప్పవచ్చు

## మరోసారి ఒకేసారి మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజా న్యూస్ నెట్‌వర్క్ కథనం ప్రకారం ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన మూడు నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయాలని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ఈ మేరకు తెలంగాణ పౌర సరఫరాల శాఖ ఆగస్టు 1 నుంచి మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీకి ఏర్పాట్లు ప్రారంభించింది. ప్రజా న్యూస్ నెట్‌వర్క్ సమాచారం మేరకు ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని కోట్లాది రేషన్ కార్డు లబ్ధిదారులకు ప్రయోజనం కలగనుంది.

# ఐఎంఏ ఆధ్వర్యంలో వైద్య సదస్సు.

**● నంద్యాల ఐఎంఏ, కర్నూలు కామినేని జెమ్ కేర్ క్యాన్సర్ ఆసుపత్రి సంయుక్త నిర్వహణ. ● వక్తలుగా పాల్గొన్న క్యాన్సర్ శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ కొల్లా మోహన్ రెడ్డి, క్యాన్సర్ రేడియేషన్ నిపుణులు డాక్టర్ సమీర్ హుస్సేన్. ● సదస్సు ప్రారంభించిన ఐఎంఏ జాతీయ కేంద్ర కమిటీ సభ్యులు డాక్టర్ రవి కృష్ణ.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో నంద్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో కర్నూలు కామినేని జెమ్ కేర్ క్యాన్సర్ ఆసుపత్రి సహకారంతో స్థానిక హోటల్ సమావేశ భవనంలో నంద్యాల ప్రాంత వైద్యులకు నిరంతర వైద్య విద్యా సదస్సు నిర్వహించారు.

నంద్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్ అధ్యక్షతన, కార్యదర్శి డాక్టర్ మహమ్మద్ రఫీ నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐఎంఏ జాతీయ కేంద్ర కమిటీ సభ్యులు, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని సదస్సు ప్రారంభించారు.

కర్నూలు కామినేని జెమ్ కేర్ ఆసుపత్రి క్యాన్సర్ శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ కొల్లా మోహన్ రెడ్డి, క్యాన్సర్ రేడియేషన్ నిపుణులు డాక్టర్ సమీర్ హుస్సేన్ ముఖ్య వక్తలుగా పాల్గొని మల్టీమీడియా సహకారంతో ప్రసంగించారు.




డాక్టర్ కొల్లా మోహన్ రెడ్డి రొమ్ము క్యాన్సర్ శస్త్ర చికిత్సలో నూతన విధానాలపై, వైద్యులకు అవగాహన కల్పించారు.

డాక్టర్ సమీర్ హుస్సేన్ "రొమ్ము క్యాన్సర్ చికిత్స లో రేడియేషన్ పాత్ర" అంశంపై ప్రసంగించారు డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ వైద్యులు ప్రాక్టీస్ చేసినంత కాలం తమ వైద్య పరిజ్ఞానాన్ని నిరంతరం పెంచుకుంటూ ఉండాలని, తద్వారా నూతన వైద్య విధానాలు, ఆధునిక పరికరాలపై అవగాహన కలిగి ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి ఆస్కారం ఏర్పడుతుందన్నారు. ఈ లక్ష్యం కోసమే వైద్యుల కోసం నిరంతర వైద్య విద్యా సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో ఐఎంఏ నంద్యాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ శ్రీనివాస్ రావు, డాక్టర్ మహమ్మద్ రఫీ, ఐఎంఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్, ఐఎంఏ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ మధుసూదన రెడ్డి, సీనియర్ వైద్యులు డాక్టర్ సహదేవుడు, కర్నూలు కామినేని జెమ్ కేర్ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ మరియు సీఈవో డాక్టర్ చంద్రశేఖర్, ముఖ్య పరిపాలన అధికారి షేక్షావలి, డీజీఎం రంజిత్ కుమార్, మేనేజర్ జకారియా, అధిక సంఖ్యలో నంద్యాల వైద్యులు, పాల్గొన్నారు.

# తల్లికి వందనం పథకం పేరుతో వచ్చే నకిలీ లింకుల పట్ల విద్యా ర్థుల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి.

**● తెలియని వ్యక్తులు పంపిన లింకులను క్లిక్ చేయవద్దు నమ్మ వద్దు. ● సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోవద్దు. ● వ్యక్తిగత వివరాలు, ఓటీపీలు ఎవరికీ పంచుకోవద్దు : ● కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్.**

పల్లెవెలుగు కర్నూలు క్రైమ్. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న "తల్లికి వందనం" పథకం పేరుతో సైబర్ నేరగాళ్లు విద్యార్థుల తల్లిదండ్రులను లక్ష్యంగా చేసుకుని నకిలీ లింకులు పంపి మోసాలకు పాల్పడే అవకాశం ఉందని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ వారు ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చ రించారు. పథకానికి సంబంధించిన దరఖాస్తులు, అర్హత వివరాలు, నగదు జమ తదితర అంశాల పేరుతో వాట్సా ప్, ఎస్ఎంఎస్ లేదా సోషల్ మీడియా ద్వారా వచ్చే అనుమానాస్పద లింకు లను క్లిక్ చేయవద్దని సూచించారు. అటువంటి లింకుల ద్వారా బ్యాంకు ఖాతావివరాలు, ఆధార్ నంబర్, ఓటీపీలు



పాస్‌వర్డ్లువంటి వ్యక్తిగత సమాచారాన్ని సేకరించి సైబర్ మో సాలకు పాల్పడే ప్రమాదం ఉందన్నా రు. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమాచారంకోసం అధికారిక ప్రభుత్వ వేదికలు స్వర్ణ గ్రామ/స్వర్ణ వార్డు కార్యా ల యాలను లేదా సంబంధిత అధి కారులను మాత్రమే సంప్రదించాలని సూచించారు. కేవలం ప్రభుత్వ అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మాలన్నారు. తెలియని వ్యక్తులు పంపిన లింకులను నమ్మవద్దని, వ్యక్తిగత వివరాలు, బ్యాం కు ఖాతా సమాచారం, ఏటీఎంవివరాలు ఓటీపీలు పాస్ వర్డ్ ఎట్టి పరిస్థితు ల్లోనూ పంచుకోవద్దని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్ లైన్‌కు కాల్ చే యాలని లేదా ఞఞఞ.ఛఎఎవతీఛతీఱఎవ. స్త్రశీఙ.ఱఅ పోర్టల్ లో లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ వారు సూచిం చారు.

# హైటెక్ వేగం.. ఆత్మీయతీరం

పల్లె వెలుగు:-సమిష్టి కుటుంబాలకు దూరంగా, వ్యక్తిగత కుటుంబాలకు దగ్గరగా బతుకుతూ మనిషి నేడు ఒంటరి జీవితాన్ని గడుపుతున్నాడు. కాలం చేతిలో కీలుబొమ్మగా మారి, ఉరుకుల పరుగుల యుగంలో కొట్టుకుపోతున్నాడు. రెప్పపాటులో లోకం మారిపోతున్న ఈ హైటెక్ యుగంలో వేగం బంధాలను మింగేస్తోంది. స్క్రీన్‌ల వెనుక చూపులు దాక్కున్నాయి. గదుల్లో మాటలు నిశ్శబ్దంగా మారాయి. సాఫ్ట్‌వేర్ కొలువుల బిజీ జీవితాల్లో పక్కనున్న మనిషిని చూసే తీరిక లేదు.. మాట్లాడే ఓపిక లేదు. కల్మషం లేని నవ్వుల సందడి ఎక్కడా కనిపించడం లేదు. కలిసి నవ్వే ఆ కమ్మని క్షణాలు కరువవుతున్నాయి. కాసేపు ఈ యాంత్రిక లోకాన్ని ఆపుదాం. ఆన్‌లైన్ బంధాల ముసుగును తొలగిద్దాం. అందరం ఒకే చోట కూర్చొని మనసు విప్పి ఆత్మీయంగా మాట్లాడుకుందాం. పాత జ్ఞాపకాలను మళ్లీ నెమరువేసుకుందాం. ప్రేమానురాగాల తీపిని పంచుకుందాం. హైటెక్ కాలంలోనూ స్నేహాన్ని గెలిపిద్దాం. మనసుల గడపలు దాటి కలుసుకుందాం. మాటల మల్లెలను వికసింపజేద్దాం. సమత, మమత, మానవీయతతో మానవాళి మనుగడకు పాటుపడుదాం. ఆత్మీయత పరిమళాలను అందరికీ పంచుదాం. ఈ బిజీ కాలంలోనూ కాసేపు ఆగుదాం. మనిషికి మనిషి తోడని చాటుదాం. సాంకేతికత సౌకర్యాలను అందిస్తుంది.. కానీ సంతోషాన్ని ఇవ్వదు. డిజిటల్ లైక్‌ల కంటే ఆత్మీయ పలకరింపే మిన్న. పరుగుల లోకాన్ని కాసేపు పక్కన పెడదాం. మనిషిని ప్రేమిస్తూ మానవత్వాన్ని గెలిపిద్దాం. నేదునూరి



కనకయ్య అధ్యక్షులు, తెలంగాణ ఎకనామిక్ ఫోరం కాలమిస్ట్, రచయిత, హైదరాబాద్

# రెవెన్యూ ఆదోని డివిజన్ నూతన కార్యవర్గం ఎన్నిక.

**● ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీ ఆర్ ఎస్ ఏ) ఆదోని డివిజన్ నూతన కార్యవర్గ ఎన్నికలు 2026--2029. ● నూతన ప్రెసిడెంట్ గా రజినీకాంత్ రెడ్డి, జనరల్ సెక్రెటరీగా వల్లి భాష.**




ఆదోని (పల్లె వెలుగు): కర్నూలు జిల్లా ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీ ఆర్ ఎస్ ఏ) ఆదోని డివిజన్ నూతన కార్యవర్గ ఎన్నికలు 19-07-2026న ఆదోని రెవెన్యూ భవన్ సమావేశ మందిరంలో ఎన్నికల అధికారి డి. నిజాముద్దీన్ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించబడ్డాయి. ఎన్నికల నోటిఫికేషన్ ప్రకారం నిర్వహించిన ఎన్నికల్లో పలు పదవులకు పోటీ జరగగా, మిగిలిన

వ ద వు ల కు




ఏకగ్రీవంగా అభ్యర్థులు ఎన్నికయ్యారు. అనంతరం ఎన్నికల అధికారి 2026--2029 పదవీకాలానికి నూతన కార్యవర్గాన్ని అధికారికంగా ప్రకటించారు. నూతన కార్యవర్గం ప్రెసిడెంట్ రజినీకాంత్ రెడ్డి (తహశీల్దార్ కౌతాళం),
అసోసియేట్ ప్రెసిడెంట్ జె.బాబు( డిప్యూటీ తాసిల్దార్), సెక్రటరీ వలిబాష (తహసీల్దార్ పెద్దకడుబురు), ట్రెజరర్ గా రాఘవేంద్ర, వైస్ ప్రెసిడెంట్స్ రుద్ర గౌడ్, జెర్మియా కౌసర్ భాను, జాయింట్ సెక్రటరీ మహేష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ రామయ్య,

స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రెటరీ బి.పెద్దయ్య

ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు రెవెన్యూ శాఖ అధికారులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమం, సేవా సమస్యల పరిష్కారం, శాఖాభివృద్ధి, ఉద్యోగుల ఐక్యతకు కృషి చేస్తామని నూతన కార్యవర్గం పేర్కొంది.

# ఘనంగా శ్రీ భక్త కనకదాసు విగ్రహ ప్రతిష్టాపన.

**విద్యతో ప్రగతికి నాంది పిల్లలను విద్యావంతులుగా చేయండి**
**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కురుబ కురుమ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప.**





ఆదోని (పల్లె వెలుగు): కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గం హోలగుంద మండలం నందు కురుబల ప్రతిష్టను ప్రపంచానికి చాటిన కురుబల కుల దైవం నమ్ముకున్న మూల పురుషుడు శ్రీశ్రీశ్రీ దాస శ్రేష్ట కనకదాసు విగ్రహ ప్రతిష్టాపన కురుబల జన సాగరం తో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కురుబ కురుమ కార్పొరేషన్ చైర్మన్ మరియు రాష్ట్ర టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి మాన్వి దేవేంద్రప్ప పాల్గొన్నారు, కనకదాసు చిత్రపటాన్ని ఊరేగింపు చేసుకొని విగ్రహ ప్రతిష్టాపన చేసి బహిరంగ సభను ప్రారంభించారు, ఈ సభను ఉద్దేశించి చైర్మన్ మాట్లాడుతూ కురుబలు సంప్రదాయానికి ప్రతిరూపం, నీతి నిజాయితీకి ప్రతికం కురుబలను సమాజంలో గుర్తించాలంటే మనము బేద విభేదాలు లేకుండా కలిసికట్టుగా ఉంటేనే ఏదైనా సాధించగలము, కురుబలు ఆర్థికంగా బలంగా ఉన్నారు, కానీ రాజకీయ రంగంలో ఎదగాలచిన అవసరం ఉంది, రాజకీయాల్లో ఎదిగితే మన హక్కులను సాధించడానికి అవకాశం ఉంటుంది, కురుబలు అన్నిరంగంలో ఎదగాలంటే ముందు లిమన పిల్లలకు ఉన్నత విద్య నేర్పించాలి అప్పుడే మనం అన్నిరంగంలో రాణించడానికి అవకాశం ఉంటుంది, కర్నూలు జిల్లాలో కురుబలు అధికంగా ఉన్నాము, అన్ని రంగాల్లో ఒక స్థాయికి ఉన్న కూడా ఏమి చేయలేక పోతున్నాము, రాజకీయంగా ముందు రావాలని కురుబలకు పిలుపునిచ్చారు, వచ్చే స్థానిక ఎలక్షన్లో కురుబలు అధిక స్థానంలో పోటీ చేసి గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరి మీద ఎంతో ఉంది, అందుకుగాను మనము ఏకతాటిగా ఉండాలని సూచించారు, కష్టపడకపోతే ఏది సాధించుకోలేము 2024 సార్వత్రిక ఎన్నికల్లో మన కురుబ కులస్తుడు కర్నూల్

ఎంపీ భస్తిపాటి నాగరాజు మనము ఎలా గెలిపించుకున్నాము అలాగే స్థానిక ఎన్నికల్లో కూడా మన కురుబలను గెలిపించుకొని మన సత్తా చూపించవలసిన బాధ్యత మనము అందరం తీసుకోవాలి అని సూచించారు, కర్నూలు జిల్లాలో హోలగుంద మండలం వెనుకబడిన ప్రాంతం ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలంటే మన కులస్తులు ముందుకు రావాలి అని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా కురువ సంఘం అధ్యక్షులు మల్లికార్జున ఆదోని నియోజకవర్గం కురువ సంఘం అధ్యక్షులు రాఘవేంద్ర వందవాగిలి శేషన్న గజ్జల్లి పత్తికొండ శ్రీనివాసులు ఆలూరు జయరాం యబ్బటం అయ్యలప్ప మరియు కర్నూలు జిల్లా ప్రతి మండలం నుంచి కురుబ కులస్తులు వచ్చి ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా చేశారని అన్నారు.

---

# వేదఘోషల మధ్య ఘనంగా గురువందన మహోత్సవం.

**☛శోభాయాత్ర, సత్కారాలు, అనుగ్రహభాషణతో ఆధ్యాత్మిక వైభవం.**





పల్లె వెలుగు నంద్యాల రూరల్. నంద్యాల శ్రీ కోదండరామాలయంలో ఆదివారం ఆషాఢ శుక్ల షష్ఠి సందర్భంగా గురుపౌర్ణిమ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన గురువందన మహోత్సవం వేదఘోషల మధ్య అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం గోపూజ, గురువందనం అనంతరం వేదపండితులు, వేదవిద్యార్థులు, పట్టణ పురోహితులు, అర్చకులు, భక్తులతో కలిసి శ్రీ కోదండరామాలయం నుంచి ఆంజనేయస్వామి దేవాలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్ర భక్తి శ్రద్ధలతో సాగి ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించింది. అనంతరం వేదవిద్యార్థులు, కృష్ణ యజుర్వేద విద్వాంసులు వేదస్వస్తి నిర్వహించారు. అనంతరం జరిగిన సార్వజనిక సభలో వేదవిద్యార్థులకు జయపత్రికలు అందజేయడంతో పాటు వేదపండితులను ఘనంగా సత్కరించారు. జగద్గురువులు కాంచీ కామకోటి మూలామ్నాయ సర్వజ్ఞ పీఠాధిపతులు పరమపూజ్య శ్రీ శ్రీ శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారు అనుగ్రహభాషణం చేసి వేద పరిరక్షణ, గురుపరంపర విశిష్టతను వివరించారు.

సభకు ఎస్.జె.ఎస్.ఎస్.ఎస్. ట్రస్ట్ చైర్మన్ తూములూరి శాయినాథ శర్మ అధ్యక్షత వహించగా, ప్రొఫెసర్ కందుకూరి వెంకట సుబ్రహ్మణ్యం సభను నిర్వహించారు. విశిష్ట అతిథులుగా డాక్టర్ ముద్దులపల్లి దత్తాత్రేయ శాస్త్రి, కుప్పా శివ సుబ్రహ్మణ్య అవధాని, గౌరవ అతిథులుగా చిట్టిభొట్ల భరద్వాజ శర్మ, జే.వి.రావు, ఆత్మీయ అతిథులుగా డాక్టర్ ఎన్. వేణుగోపాల్, హర్యర శ్రీనివాసరావు, సముద్రాల సూరయ్య పాల్గొన్నారు. ట్రస్ట్ కార్యదర్శి పసుమర్తి బ్రహ్మానంద శర్మ నివేదిక సమర్పించగా, యాదవల్లి కార్తికేయ శర్మ వందన సమర్పణ చేశారు.

ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ యేడిది సుబ్రహ్మణ్య సూర్యనారాయణ మూర్తి స్మారక ఉత్తమ అధ్యాపక పురస్కారం, బ్రహ్మశ్రీ కుప్పా లక్ష్మావధాని స్మారక అత్యుత్తమ విద్యార్థి పురస్కారం, బ్రహ్మశ్రీ కుప్పా సుబ్రహ్మణ్య శాస్త్రి స్మారక ఉత్తమ విద్యార్థి పురస్కారంలను ఆయా కుటుంబ సభ్యులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ ప్రసాద్తో పాటు భగవత్ సేవా సమితి సభ్యులు, వేదపండితులు, పురోహితులు, అర్చకులు, భక్తులు, పట్టణ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం గురువందనం నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

# గుట్టపాడు గ్రామ ఎస్సీ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించండి

**ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి నాగన్న డిమాండ్**



పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : ఓర్వకల్లు మండలం గుట్టపాడు ఎస్సీ కాలనీలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఏ రామకృష్ణ ఆధ్వర్యంలో పర్యటించడం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి. నాగన్న మాట్లాడుతూ గుట్టపాడు ఎస్సీ కాలనీలో ఉన్న మరుగుదొడ్డు పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదని నీళ్లు రావడంలేదని దానివల్ల మహిళలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు మరియు ఆ కాలనీలో బోరింగ్ వద్ద నుండి పై వరకు సిసి రోడ్డు సైడు కాలువలు లేవని దీనివల్ల కాలనీవాసులు మురుగునీరు ఇతర నీళ్లు పోవడానికి ఇబ్బందిగా ఉందని అన్నారు గ్రామంలో ఉన్న స్మశానం గతంలో రెండు ఎకరాల విస్తీర్ణంలో ఉండేదని ఇప్పుడు స్మశానం తగ్గిపోతుందని వెంటనే సర్వే చేయించి స్మశాన స్థలానికి కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు అదేవిధంగా ఎస్సీ కాలనీలో మంచినీళ్ల కోసం రింగు ట్యాంకులు ఏర్పాటు చేయాలని దానివల్ల కాలనీ వాసులకు కరెంటు లేనప్పుడైనా పనులకు వెళ్లి వచ్చిన తర్వాతైనా నీళ్లు ఉంటాయని అన్నారు కనుక తక్షణమే ఎస్సీ కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో ప్రభాకర్ స్వాములు జయన్న కాసిం వెంకటేశ్వరమ్మ కుమారి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నపాటి వర్షానికే చెరువును తలపిస్తున్న ఆర్టీసీ కొత్త బస్టాండ్.

**పట్టించుకోని ఆర్టీసీ అధికారులు సిపిఎం ఆదోని.**





ఆదోని (పల్లె వెలుగు): ఆదోని పట్టణం ఆర్టీసీ కొత్త బస్టాండ్ ఆవరణంలో నిలువ ఉన్న వర్షపు నీటిని పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాధాకృష్ణ, వెంకటేశులు, ఆదోని పట్టణ మండల, కార్యదర్శిలు లక్ష్మన్న, లింగన్న, అనంతరం వీరు మాట్లాడుతూ ఆదోని ఆర్టీసీ కొత్త బస్టాండ్ అపరిశుభ్రతకు నిలయంగా ఉందని, చిన్నపాటి వర్షానికి బస్టాండ్ ఆవరణము చిన్న చెరువును తలపిస్తుందని వారు తెలిపారు. బస్టాండ్ ఆవరణము వర్షపు నీటితో, మురుగు నీటితో అపరిశుభ్రంగా ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. బస్టాండ్ ఆవరణంలో పటిష్టమైన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. సన్మానక అధికారులు వెంటనే స్పందించి బస్టాండ్ ఆవరణములో పరిశుభ్రమైన వాతావరణం ఉండే విధంగా తగు చర్యలు తీసుకోవాలని వారు తెలిపారు.

# ఆశ వర్కర్లకు కనీస వేతనం నెలకు 26 వేల రూపాయలు పెంచాలి.

**సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు జరుగు ధర్నాను జయప్రదం చేయండి.**



**సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ డిమాండ్.**

ఆదోని (పల్లె వెలుగు): ఈరోజు సిఐటియు కార్యాలయంలో రెవెన్యూ డివిజన్ స్థాయి ఆశ వర్కర్ల సమావేశం జిల్లా ఉపాధ్యక్షురాలు వెంకటమ్మ అధ్యక్షతన జరిగింది. సమావేశాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ, ఆశ వర్కర్లు జిల్లా యూనియన్ కార్యదర్శి బి శివలక్ష్మి, దస్తగిరిమ్మ , ధర్నా పోస్టర్ల ఆవిష్కరణ చేయడం జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా ఆశ వర్కర్లకు కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు జీతాలు పెంచుతాం అన్న హామీని అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కనీస వేతనాలు అమలు చేయాలని ఆశ వర్కర్లకు నెలకు 26 వేల రూపాయలు జీతాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే అర్హత కలిగిన ఆశ వర్కర్లకు ఏఎన్ఎంలుగా ప్రమోషన్ కల్పించాలని, వీటితోపాటు పీఎఫ్ సౌకర్యం గ్రాచుటీ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, స్కీం వర్కర్ల హక్కుల సాధన కోసం వేతనాలు పెంచాలని ఈ నెల 31 తేదీ జరుగు కలెక్టరేట్ కార్యక్రమానికి ఆశ వర్కర్లందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు మంజుల లత ఇందిరా పద్మ తదితరులు పాల్గొన్నారు.

# ఇండియన్ రెడ్ కాస్ సొసైటి నంద్యాల అద్వర్యంలో వన మహొత్సవ కార్యక్రమం.



పల్లె వెలుగు నంద్యాల రూరల్. నంద్యాల జిల్లా, బండి ఆత్మకూరు మండలము, శింగవరం గామ సమీపంలో వెలసిన బూరుగు లింగమయ్య స్వామి ఆవరణంలో నంద్యాల జిల్లా ఇండియన్ రెడ్ కాస్ అద్యక్షులు, గౌరవ జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా మరియు ఇండియన్ రెడ్ క్రాస్ చైర్మన డా॥ పర్ల దస్తగిరి పిలుపు మేరకు, గుడి-బడి-పచ్చదనం పరిశుభ్రతతో విరిసిల్లాలనే ఆలోచన మేరకు నంద్యాల జిల్లా రెడ్క్రాస్ కార్యవర్గ సభ్యులు వి- యాకుబ్ నేతృత్వంలో భక్తుల సౌకర్యార్థం మరియు పర్యావరణ పరిరక్షణలో భాగంగా దాదాపు 100 మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సభ్యులైన మల్లేష్, సల్యాన్, ఫాజిల్, హేమంత, ధనుంబమముడు, కిట్టు, అక్షద్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఆకాశంలో విక్రమ్ విజయం

పల్లె వెలుగువిక్రమ్-1 విజయం భారత అంతరిక్ష రంగంలో చారిత్రక ఘట్టంగా నిలిచింది. స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన రాకెట్ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లడం దేశానికి గర్వకారణం. ఏడు అంతస్తుల భవనం ఎత్తులో నిలిచిన ఈ రాకెట్ తన తేలికపాటి నిర్మాణంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నాలుగు దశల్లో సాగే విక్రమ్-1 ప్రయాణం భారత అంతరిక్ష రంగంలో కొత్త ప్రస్థానానికి నాంది పలికింది. మూడు ఘన ఇంధన బూస్టర్లు, రామన్ ఇంజన్తో నడిచే ద్రవ ఇంధన శక్తి వ్యవస్థలు, 3డీ ప్రింటింగ్ టెక్నాలజీతో రూపొందించిన పరికరాలతో ఈ రాకెట్ అభివృద్ధి చేయబడింది. సుమారు 350 కిలోల బరువును మోస్తూ భూమికి సమీప కక్ష్యలోకి ఉపగ్రహాలను ప్రవేశపెట్టడం దీని ప్రత్యేకత. శ్రీహరికోట వేదికగా శనివారం జరిగిన ఈ ప్రయోగం భారత అంతరిక్ష రంగంలో ప్రైవేటు సంస్థల భాగస్వామ్యానికి కొత్త బాటలు వేసింది. మిషన్ విజయవంతం కావడంతో భారత్ ప్రైవేట్ స్పేస్ యుగంలోకి మరింత ముందడుగు వేసింది. అంతరిక్ష రంగంలో ప్రైవేటు భాగస్వామ్యం పెరగడం ద్వారా నూతన ఆవిష్కరణలు వేగవంతం కావడంతో పాటు యువత కలలకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు. హైదరాబాద్కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ అభివృద్ధి చేసిన విక్రమ్-1 విజయవంతం కావడం దేశానికి గర్వకారణమని, ఇది స్వదేశీ ప్రతిభ, సాంకేతిక సామర్థ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. అంతరిక్ష సాంకేతిక రంగంలో తెలంగాణ కూడా కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు విక్రమ్-1 విజయవంతమైన సందర్భంగా శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులు, సిబ్బందికి అభినందనలు వెల్లువెత్తాయి. భారత అంతరిక్ష రంగంలో ప్రైవేటు సంస్థల భాగస్వామ్యానికి ఈ విజయం మరింత బలాన్నిచ్చిందని పలువురు పేర్కొన్నారు.-- నేదునూరి కనకయ్య అధ్యక్షులు, తెలంగాణ ఎకనామిక్ ఫోరం, హైదరాబాద్లి (విక్రమ్-1 విజయంపై అభినందనలు వ్యక్తం చేస్తూ, శనివారం జరిగిన ప్రయోగం నేపథ్యంలో రాసిన కవిత.)

## మాజీ మంత్రి కనుమూరి బాపిరాజుతో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ భేటీ

జగ్గంపేట, జూలై 19 పల్లె వెలుగు న్యూస్ :– ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, తిరుమల



తిరుపతి దేవస్థానం మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు ఆదివారం జగ్గంపేటలోని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ క్యాంప్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఇరువురు నేతలు భేటీలో పలు అంశాలపై చర్చించుకున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం పర్చేజింగ్ కమిటీ చైర్మన్ మరియు బోర్డు సభ్యుడిగా జ్యోతుల నెహ్రూ చేపడుతున్న పారదర్శక పాలన, భక్తుల సౌకర్యాల మెరుగుదల మరియు నిధుల సద్వినియోగంపై కనుమూరి బాపిరాజు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, పోతుల మోహనరావు, కొత్త కొండబాబు, పాండ్రంగి రాంబాబు, పాలచర్ల నాగేంద్ర చౌదరి, వేములకొండ జోగారావు, తిరుమల రాజు మురళి రాజు, కృష్ణంరాజు, నలమాటి ఆనంద్ సహా పలువురు స్థానిక నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు

## పేదల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



జగ్గంపేట, జూలై 19 పల్లె వెలుగు న్యూస్ పేదవారి ఆరోగ్యమే ప్రభుత్వ ప్రాధాన్యత అని జగ్గంపేట శాసనసభ్యులు, తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యులు, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గోకవరం మండలం గోకవరం గ్రామానికి చెందిన సానపల్లి ద్రౌపది కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) కింద రూ. 1,71,277 విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసి)ను ఆయన అందజేశారు. రాజమండ్రి అపెక్స్ హాస్పిటల్స్లో చికిత్స కోసం ఈ ఆర్థిక సాయం మంజూరైంది. గోకవరం మాజీ ఎంపీటీసీ చింతల రామకృష్ణ బాధితుల సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఆయన తక్షణమే స్పందించి సాయం అందేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులతో వైద్యానికి దూరమవుతున్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ద్వారా సహాయం అందుతుందని, అవసరమైన వారు తనను సంప్రదించవచ్చని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహనరావు, జగ్గంపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుంకవిల్లి రాజు తదితరులు పాల్గొన్నారు

## అభివృద్ధి పనులను పరిశీలించిన శాసనసభ విప్ దాట్ల సుబ్బరాజు

ముమ్మిడివరం, జూలై 19 పల్లె వెలుగు న్యూస్ :– డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా



ముమ్మిడివరం మండలం గేదెల్లంక గ్రామంలో జరుగుతున్న రహదారి అభివృద్ధి పనులను శాసనసభ విప్, స్థానిక శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు ఆదివారం పరిశీలించారు. దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ఉత్తరవాహిని త్రివేణి సంగమం పుష్కర ఘాట్ ప్రాంతంలో జరుగుతున్న పనుల పురోగతిపై ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ, అభివృద్ధి పనులలో ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యత తగ్గకూడదని, నిర్ణీత గడువులోగా పనులన్నీ పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుత్తుల సాయి, నాయకులు గొలకోటి దొరబాబు, అర్ధాని శ్రీనివాస్, గుద్దటి రమా కేశవ బాలకృష్ణ (జమ్మి) తో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు

## దివంగత గొలుగూరి మునిరెడ్డికి ఘన నివాళులు : ఆయన సేవలును స్మరించుకున్న ప్రముఖులు




రావులపాలెం, జూలై 19 పల్లె వెలుగు న్యూస్ :– వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఉపసర్పంచ్, దివంగత గొలుగూరి మునిరెడ్డి కార్యక్రమం రావులపాలెంలోని ఆయన స్వగృహం వద్ద జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మునిరెడ్డి పార్టీ పట్ల చూపిన అంకితభావం, నిబద్ధత కార్యకర్తలకు ఆదర్శమని, ఆయన లేని లోటు పార్టీకి తీరనిదని కొనియాడారు. మునిరెడ్డి హయాంలో జరిగిన అభివృద్ధి పనులను, ప్రజలతో ఆయనకు ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా పలువురు నాయకులు గుర్తుచేసుకున్నారు. ఒక నిబద్ధత కలిగిన నాయకుడిగా, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్య ప్రకాష్, మాజీ ఎంపీ చింతా అనురాధ, రాష్ట్ర కార్యదర్శులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, కర్రి నాగిరెడ్డి, గొల్లపల్లి డేవిడ్ రాజ్ పాల్గొన్నారు. వీరితో పాటు పలువురు ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు మరియు మునిరెడ్డి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నివాళులర్పించారు. పార్టీ అభివృద్ధిలో మునిరెడ్డి పోషించిన కీలక పాత్రను, ఆయన అందించిన సేవలను స్మరిస్తూ నాయకులు భావోద్వేగానికి లోనయ్యారు. పలువురు ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు మరియు మునిరెడ్డి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నివాళులర్పించారు

# నరసన్నపేటలో పంచాయతీ నిర్లక్ష్యం ! ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు




నరసన్నపేట, జూలై 19పల్లె వెలుగు న్యూస్నరసన్నపేట పట్టణం లో అత్యంత రద్దీగా ఉండే ప్రాంతంలో పాడైపోయిన కల్వర్టు మరమ్మతుల విషయంలో స్థానిక పంచాయతీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వందలాది వాహనాలు, ప్రజలు రాకపోకలు సాగించే ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టు పలకలు విరిగిపోయి ప్రమాదకరంగా మారినా, పట్టించుకునే నాథుడే కరువయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీస్ స్టేషన్, కోర్టు, రిజిస్టర్ ఆఫీస్ మరియు రాజకీయ పార్టీల కార్యాలయాలు ఉన్న ఈ ప్రాంతంలో నిత్యం వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. రోడ్డు మధ్యలో ఉన్న కల్వర్టు పైకప్పులు (స్లాబ్‌లు) విరిగిపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనదారులు ఈ గుంతలను గమనించక పడిపోయిగాయాలపాలవుతున్నారు. పలుమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా, ఫిర్యాదులు చేసినా పంచాయతీ యంత్రాంగం మాత్రం కనీస చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

మానవత్వంతో ముందుకొచ్చిన ఈశ్వర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రజలు పడుతున్న ఇబ్బందులను చూసి చలించిపోయిన 'ఈశ్వర్ చారిటబుల్ ట్రస్ట్' వ్యవస్థాపకులు మార్పు విజయకుమార్, సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకుని రంగంలోకి దిగారు. అధికారులు చేయాల్సిన పనిని బాధ్యతగా తీసుకుని, ఎటువంటి ప్రభుత్వ నిధుల సహాయం లేకుండానే తన సొంత నిధులతో విరిగిపోయిన కల్వర్టు పలకలను తొలగించారు. అనంతరం, కొత్త సిమెంట్ స్లాబ్‌లను ఏర్పాటు చేసి ప్రమాదకరంగా ఉన్న ఆ ప్రాంతాన్ని వాహనదారులకు అనుకూలంగా మార్చారు. పంచాయతీ అధికారులు నిర్వర్తించాల్సిన బాధ్యతలను ఒక ప్రైవేటు సంస్థ లేదా వ్యక్తులు చేపట్టడం ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ అధికారులు క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి పరిష్కరించడంలో విఫలమయ్యారని, అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా పట్టణంలోని ఇటువంటి ప్రమాదకరమైన ప్రదేశాలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

----------------------------------------

# బలభద్రపురం లో అయ్యప్పస్వామికి వైభవంగా 'ఉత్తర నక్షత్ర' పూజలు



బిక్కవోలు / బలభద్రపురం,జులై 19: అనపర్తి నియోజకవర్గ ప్రతినిధి, కర్రి దుర్గారెడ్డి (ఆంధ్రాప్రదేశ్ సమాచారం దినపత్రిక): తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గం, బిక్కవోలు మండలం బలభద్రపుర గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. స్థానిక శ్రీకృష్ణ సంతోషిమాత అయ్యప్పస్వామి దేవాలయంలో అయ్యప్పస్వామి వారి జన్మ నక్షత్రమైన 'ఉత్తర నక్షత్రం' సందర్భంగా ఆదివారం విశేష పూజలు, ప్రత్యేక అభిషేకాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. స్వామివారి కృపాకటాక్షాల కోసం నియోజకవర్గ నలుమూలల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి, ఆలయాన్ని సందర్శించారు. నయనా నందకరంగా విశేష పూజలు, అభిషేకాలు ఉత్తర నక్షత్ర మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రధాన పూజారులు కామేష్ శర్మ, సుమంత్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచే శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారికి పాలాభిషేకం, పంచామృతాభిషేకం అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి అష్టోత్తర శతనామార్చన, ధూపదీప నైవేద్యాలు సమర్పించి, మహా హారతి ఇచ్చారు. భక్తుల 'స్వామియే శరణం అయ్యప్ప' నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. దర్శనానంతరం భక్తులకు ఆలయ కమిటీ వారు తీర్థప్రసాదాల వితరణ చేశారు. ప్రతి నెల ఉత్తర నక్షత్రం రోజున స్వామివారికి ఇదే రీతిన ప్రత్యేక పూజలు నిర్వహించడం ఇక్కడి ఆలయ ఆనవాయితీ అని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ సబ్బేళ్ళ రామారెడ్డి మాట్లాడుతూ.. బలభద్రపురంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న శ్రీ కృష్ణ సంతోషిమాత– –అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణ పనులు ప్రస్తుతం తుది దశకు చేరుకున్నాయని హర్షం వ్యక్తం చేశారు. భక్తులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఆలయ ప్రారంభోత్సవ ముహూర్తం ఖరారైందని ఆయన ప్రకటించారు. రాబోయే నవంబర్ 25, బుధవారం రోజున ఆలయ ప్రారంభోత్సవ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా, శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ చారిత్రాత్మక ఆధ్యాత్మిక కార్యక్రమానికి భక్తులు, దీక్షాపరులు పెద్ద ఎత్తున హాజరై, స్వామివారిని దర్శించుకుని కృపాపాత్రులు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆలయ చైర్మన్ సబ్బేళ్ళ రామారెడ్డి పర్యవేక్షణలో, ప్రధాన పూజారులు కామేష్ శర్మ, సుమంత్ శర్మల బ్రహ్మత్వంలో జరిగిన ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో స్థానిక ప్రముఖులు, పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు, అయ్యప్ప స్వాములు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమం విజయవంతం కావడానికి ఆలయ వాలంటీర్లు, సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

### బొబ్బర్లంక-పల్లంకుర్రు కాలువలో తూడు తొలగింపు !

# సాగునీటి అడ్డంకులను తొలగించేలా చర్యలు




కాట్రేనికోన, జూలై 19పల్లె వెలుగు న్యూస్ కాట్రేనికోన మండల పరిధిలోని బొబ్బర్లంక-పల్లంకుర్రు ప్రధాన పంట కాలువలో నెలకొన్న సాగునీటి సమస్యల పరిష్కారానికి అధికారులు నడుం బిగించారు. పల్లంకుర్రు వద్ద కాలువలో పేరుకుపోయిన గుర్రపు డెక్క, చెత్తాచెదారం వల్ల సాగునీటి సరఫరాకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఈ నేపథ్యంలో, కాలువ ప్రవాహానికి అడ్డుగా ఉన్న వ్యర్థాలను తొలగించే పనులు వేగంగా జరుగుతున్నాయి. కాట్రేనికోన డీసీ ఆకాశం శ్రీనివాసు పర్యవేక్షణలో జేసీబీ యంత్రాల సాయంతో యుద్ధ ప్రాతిపదికన ఈ పూడికతీత, వ్యర్థాల తొలగింపు పనులు చేపడుతున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కాలువల నిర్వహణ పట్ల నిర్లక్ష్యం వహిస్తే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు వ్యక్తులు కాలువలోకి జంతు కలేబరాలను, ఇతర వ్యర్థాలను వేయడం వల్ల నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతోందని శ్రీనివాసు పేర్కొన్నారు. "ఇది తాగునీరు మరియు సాగునీరు రెండింటికీ ప్రధాన ఆధారం. ఇటువంటి ముఖ్యమైన కాలువను చెత్తతో నింపడం క్షమించరాని నేరం," అని ఆయన హెచ్చరించారు. కాలువలను స్వచ్ఛంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన గుర్తు చేశారు. కాలువలపై ఆక్రమణలు (జుఅఎతీశ్రీఎష్టఎవత్ం) జరగడం వల్ల నీటి ప్రవాహ వేగం తగ్గి, కాలువ చివరి భాగాల్లోని (శివారు) పొలాలకు సాగునీరు అందడం లేదని ఆయన గుర్తించారు. ఈ ఆక్రమణల వల్ల నీటి పారుదల వ్యవస్థ కుంటుపడుతోందని, దీనిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని స్పష్టం చేశారు. కాలువ నిర్వహణలో లస్కర్ల పాత్ర అత్యంత కీలకమని, వారు ఎప్పటికప్పుడు కాలువ పరిస్థితిని పర్యవేక్షించాలని శ్రీనివాసు ఆదేశించారు. ఎక్కడైనా అడ్డంకులు ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, కాలువలో చెత్త వేయకుండా నిరంతరం పహారా కాయాలని సూచించారు. పంట కాలువలు పూర్తిస్థాయిలో ప్రక్షాళన జరిగే వరకు పర్యవేక్షణ కొనసాగుతుందని ఆయన తెలిపారు.

# రహదారి ఆక్రమణల పై ఎమ్మెల్యే కు గ్రామస్తుల ఫిర్యాదు.. తక్షణమే సర్వే చేసి చర్యలు తీసుకోవాలని తహసిల్దార్‌కు ఆదేశం



ముమ్మిడివరం జూలై 19 పల్లె వెలుగు న్యూస్:కాట్రేనికోన మండలం దొంతుకుర్రు, గెద్దనపల్లి పంచాయతీ ల సరిహద్దులో గల ప్రధాన రహదారిని కొందరు వ్యక్తులు ఆక్రమించుకున్నారంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు బాధితులు ఆదివారం ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజును కలిసి తమ సమస్యను వివరిస్తూ లిఖితపూర్వక ఫిర్యాదును అందజేశారు. గ్రామస్తుల ఫిర్యాదు ప్రకారం, కాశి వెంకటేశ్వరరావు మరియు ఆయన కుటుంబ సభ్యులు గ్రామ సరిహద్దుల్లో ఉన్న బహిరంగ రహదారిని అక్రమంగా ఆక్రమించుకున్నారు. దీనివల్ల నిత్యం రాకపోకలు సాగించే స్థానికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ ఆక్రమణపై ప్రశ్నించిన గ్రామస్తులను సదరు వ్యక్తులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, తమపై దౌర్జన్యాలకు దిగుతున్నారని ఎమ్మెల్యేకు వివరించారు. ఈ అక్రమ నిర్మాణాల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, అధికారులు వెంటనే జోక్యం చేసుకుని ఆక్రమణలను తొలగించాలని వారు కోరారు. గ్రామస్తుల సమస్యను సావధానంగా విన్న ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగిస్తూ, చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల విషయంలో నిర్లక్ష్యం వహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. వెంటనే రంగంలోకి దిగిన ఎమ్మెల్యే, కాట్రేనికోన తహసిల్దార్ రవికిరణ్‌కు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. వివాదాస్పద ప్రాంతంలో తక్షణం రెవెన్యూ అధికారులతో సర్వే చేయించాలని, ఆక్రమణలు వాస్తవమని తేలితే వెంటనే వాటిని తొలగించి బాధితులకు న్యాయం చేయాలని ఆయన సూచించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో రెవెన్యూ అధికారులు త్వరలోనే ఆ ప్రాంతంలో సర్వే నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ఆక్రమణలను తొలగించి, రహదారిని ప్రజల వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు, బాధితులు పాల్గొన్నారు.

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com